# 16069 అధిగమిస్తే రికవరీ




## సెన్సెక్స్ విశ్లేషణ

**జనవరి 7తో ముగిసిన వారానికి**

**సమీక్ష** : కొత్త సంవత్సరం తొలి వారం లాభాలతో ముగిసింది. తొలుత మార్కెట్లు స్తబ్దంగానే మొదలయ్యాయి. ఒక దశలో 15358 వద్ద రెండు వారాల కనిష్ఠ స్థాయిని తాకింది. అయితే భారత మార్కెట్లలో నేరుగా పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం; జర్మనీ తయారీ గణాంకాలు మెరుగ్గా ఉండడం తదితర అంశాలు మార్కెట్‌ను సానుకూలతల వైపు నడిపించాయి. వచ్చే పరపతి విధాన సమీక్షలో రిజర్వు బ్యాంకు కీలక రేట్ల దిశగా అడుగులు వేస్తుందన్న అంచనాలతో మార్కెట్ మరింత రాణించింది. ఆహార ద్రవ్యోల్బణం ప్రతికూల స్థాయిలోకి జారడం ఈ అంచనాలకు దోహదం చేసింది. దీంతో వారం మొత్తం మీద సెన్సెక్స్ 394 పాయింట్ల లాభం పొందింది. 15849 వద్ద స్థిరపడింది.

**ఎఫ్ఐఐల తీరు** } విదేశీ సంస్థాగత మదుపుదార్లు (ఎఫ్ఐఐలు) గత వారం రూ.1006.40 కోట్ల నికర కొనుగోళ్లు చేయగా ఫండ్లు సైతం నికరంగా రూ.69.90 కోట్ల కొనుగోళ్లు చేశాయి.

**రంగాల వారీగా** } కీలక రేట్లు తగ్గుతాయన్న అంచనాల మధ్య వడ్డీ రేట్లతో ప్రభావితమయ్యే బ్యాంకింగ్, యంత్ర పరికరాల సూచీలు అత్యధికంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూలతలు లోహ కౌంటర్ లాభపడడానికి కారణమయ్యాయి. ఎఫ్ఎమ్‌సీజీ రంగం డీలా పడగా.. నెలవారీ విక్రయ గణాంకాలు వాహన షేర్లపై ప్రభావం చూపాయి.

**లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 7:3గా నమోదవడం చిన్న, మధ్య స్థాయి స్క్రిప్‌లలో కొనుగోళ్లు జరిగాయనడాన్ని సూచిస్తోంది.**

**భవిష్యత్ అంచనా** } గత ఏడు వారాలుగా సెన్సెక్స్ 15100-17100 మధ్య శ్రేణిలో చలిస్తోంది. మార్కెట్ 16069 పై స్థాయిల్లో స్థిరపడితే రికవరీ కొనసాగే అవకాశం ఉంది. 15478 కంటే దిగువకు వస్తే మాత్రం రివకరీ పూర్తయిందని భావించాలి. అపుడు మరో బలహీనతల దశ ప్రారంభం కావొచ్చు. అమెరికా మార్కెట్ల సానుకూలతల నేపథ్యంలో వీటి పరిణామాలను మార్కెట్ జాగ్రత్తగా గమనించవచ్చు. ఐరోపా పరిస్థితులు కూడా కీలకం కానున్నాయి.

**ప్రభావిత అంశాలు** } 12న పారిశ్రామికోత్పత్తి సూచీ(ఐఐపీ) గణాంకాలు విడుదల కానున్నాయి. ఇవి మెరుపడితే మార్కెట్లు లాభాలు పొందే అవకాశం ఉంది. లేదంటే వృద్ధిపై అనుమానాలు మరింత పెరగవచ్చు. ఆ తర్వాత వెలువడే మూడో త్రైమాసిక గణాంకాలు కూడా మార్కెట్ దిశను నిర్దేశిస్తాయి. ప్రతికూల స్థాయిలోకి జారిన ఆహార ద్రవ్యోల్బణం గణాంకాలపై; వారాంతంలో వెలువడే డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణ గణాంకాలపై కూడా మార్కెట్ ఓ కన్నేయవచ్చు. ఇంకా రూపాయి మారక విలువ, ముడి చమురు ధరలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేయవచ్చు.

**నిరోధ స్థాయిలు: 16133, 16383, 16642 మద్దతు స్థాయిలు: 15761, 15641, 15358**

**16069 స్థాయిపైన ముగిస్తే మార్కెట్ రికవరీ కొనసాగవచ్చు.**

*– సతీశ్ కంతేటి, జెన్ మనీ*